టులెట్ బోర్డు తగిలించి, నిచ్చెన దిగి, విరక్తిగా ఆ ఇంటి వేపు చూసి, "థూ" అన్నాడు చెన్నకేశవరావు.

'సీతా ... ఓ సీతా ... ఎంత పని చేశావే!' అతని గుండె లవిసిపోయాయి. ఇక ఆ ఇంటికి, తనకి తీరిపోయింది.

"వెధవా, ఆ చాయల కెళ్ళి, అద్దె కొచ్చిన వాళ్ళతో మళ్ళీ ఏదన్నా గొడవ తెచ్చుకున్నావో, కాళ్ళిరగ్గొడతాను" అనేసింది వాళ్ళమ్మ.

తనేమన్నా అల్లాట్లోవాడా! కాలం కలిసొస్తే ఓ బ్రిలియంట్ ఆర్టిస్ట్. బెంగాలీబాబులా జుబ్బా వేసుకొని, పైన శాలువా కప్పుకొని రోడ్డుమీద పోతుంటే 'కేశవ్ రాయ్ చన్నా' అని జనం చెప్పుకునే రోజొస్తుంది. పాపం, అంతవరకూ అతని 'ఆర్ట్'కు డిమాండ్ రాలేదు. కనీసం అట్టమీద బొమ్మ కూడా వేయించుకోలేదు.

"ఏరా, నాన్నగారి పేరూ, నా పేరూ నామరూపాల్లేకుండా చేశావు కదరా!" అన్నగారి సమీక్ష. నాన్నగారి పేరుమీద ఏదన్నా ఉందిగాని, వీడి పేరుమీద వయాపైసా లేదు; నామమూ లేదు, ఊసమూ లేదు.

ఆ కొంపకి అద్దె కెవరయిన వస్తే వాళ్ళు ముగ్గురూ మూడు రకాలుగా ఆలోచిస్తారు.

తల్లిగారికి: ఎక్కువ మంది జనం ఉండరాదు. సెప్టిక్ టాంకు నిండి మురుగు రోడ్డుమీది కొస్తే మ్యునిసిపాలిటీ వాళ్ళతో తగాదా. చిన్న పిల్లలుంటే గోతులు తవ్వి గచ్చు పాడుచేస్తారు. గోడలకి పటాలు కొట్టరాదు. పైర్లు పీకరాదు. రిపేర్లు చేయించరాదు. సున్నం వగైరా వాళ్ళే వేయించుకోవాలి... మొదలైనవి.

అన్నగారికి: అద్దె ఎక్కువ ఇవ్వాలి. అడపాదడపా ఏవైనా రికమెండేషన్లు చేసి పెట్టే వాళ్ళు కావాలి. కార్లూ వగైరా ఉంటే లిఫ్టు ఇస్తుండాలి. అప్పుడప్పుడూ అమ్మకి తెలియకుండా వందా ఏభై సర్దుబాటు చేస్తుండాలి. మ్యునిసిపాలిటీ వాళ్ళు అడిగితే అద్దె మూడొందలయినా అందులో సగమే చెప్పాలి—వగైరా.

తనగారికి: ఓ అందమైన పెళ్ళికాని అమ్మాయి లేదా అమ్మాయిలు ఉండాలి. తను అద్దెకోసం వచ్చినప్పుడు ఆ అమ్మాయే డబ్బు ఇవ్వాలి. డబ్బు తీసుకుంటున్నప్పుడు తన వేళ్ళు తగిలితే చిరునవ్వునాత్రమే నవ్వాలి. చిలిపిగా ఏదయినా జోకు వేస్తే చెంప వాయించరాదు. మంచి సినిమా వచ్చింది వెళదామా అంటే అభ్యంతరం చెప్పరాదు. స్నానాల వేళ తను ఆవతల డాబా ఎక్కి చూస్తున్నప్పుడు పెద్దవాళ్ళకి కంప్లెయింట్ చెయ్యరాదు—ఎట్సెట్రా.

ఇది ఇలా ఉండగా ఒక రోజు రాత్రి, అంటే అదో లాంటి రాత్రి...రెండు మూడు రోజులనుంచి వర్షం కురిసి చెరువు నిండి కప్పలు భోరున అరుస్తున్న రాత్రి భీమేశ్వరరావు ఆవురావురుమంటూ వచ్చాడు. "కూరేం టక్కా, మసాలా వాసన నసాళానికి ఎక్కుతూంది" అన్నాడు.

"సీత్రలా." గట్టిగా అంటే తిండి పెట్టమంటాడని భయం భయంగా అంది.

(సీత అంటే గిట్టని వాళ్ళకి ఈ కథలో ఇక సీతల ప్రసక్తి రాదని హామీ ఇస్తున్నాను).

"మరేం లేదు, మనింటికి మణుసులొస్తున్నారు" అన్నాడు భీమేశ్వరరావు.

"ఏడిశావ్. నువ్వు మణుసుల్ని దింపింది చాలు, ఇక నోరు మూసుకో." అక్కయ్య అంది.

భీమేశ్వరరావు ఇంతకుముందు ఓ పార్టీ దగ్గర వంద పుచ్చుకొని ఇంట్లో దించాడు.

అమ్మకి కావలసిన చిన్న పిల్లలు లేరు.

అన్నకి అద్దె రెండు రెట్లు.

తన ఛాయిస్ ఆడపిల్లలు ఆఫ్రికా గుర్రాల్లాంటి వాళ్ళు ఆరుగు రున్నారు.

వారం రోజుల్లో తెలిసింది, వాళ్ళు సంసారులు కారని.

ఆ సంతని వదిలించుకునేలాగా ఆ వాడకట్టంతా సెప్టిక్ ట్యాంకులా తయారయింది.

పోలీసులూ గట్రా వచ్చి వాళ్ళచేత ఇటువంటి ముఠాలకి ఇల్లు వదలం అని ప్రమాణంచుకున్నారు.

చాలా పస్తాయించుకున్నారు.

ఆ తరవాత ఇద్దరు ముగ్గురు కుటుంబీకులు వచ్చారు. రాత్రిళ్ళు విటుల తాకిడి! అంటే, చాలా సాధారణంగా వచ్చేసి (సారాబుడ్డి చీకులు, బిర్యానీ పొట్లాలతో సహా) ఇంటళ్ళుళ్ళలా పక్కమీద పడుకొని అమ్మాయిల్ని రమ్మనేవారు.

బెదిరి పారిపోయారు సంసారులు.

"నా కొంప సానుల కివ్వనా" అంది అమ్మ కూరలో కారం వేస్తూ.

"నాకు బుద్ధొచ్చిందక్కా. ఫస్టుక్లాసైన ఫామిలీ వాళ్ళు. ఒక పెద్దాయన. పెళ్ళాం సచ్చిపోయిందనుకుంటా. ఉద్యోగం చేస్తున్న అమ్మాయి. చిన్న బొట్టిగాడు. అంతే." భీమేశ్వరరావు నొక్కి వక్కాణించాడు.

"మూడొందలకి తక్కువైతే ఇవ్వను" స్నానాల గదిలోంచే అందుకున్నాడు అన్నయ్య.

"మూడొందల ఏభైకి కుదిర్చా, అడ్వాన్సెంత కావాలి?"

కాస్సేపు నిశ్శబ్దం.

"మామూలుగా ... రెణ్ణెల్లి దవ్వమను." వరండాలో సబ్బు రాసుకొని ముఖం కడుక్కుంటున్న చెన్నకేశవరావు అందుకున్నాడు, అమ్మ ఎక్కువ అడిగేస్తుందేమోనని.

"మూణ్ణెల్లి అద్దె పట్టుకొచ్చాను."

"అదేం కుదరదు. వెయ్యి మీద అయిదొందలు పట్టా. సున్నం నీ బాబు కొడతాడా, కరంటు ఛార్జి నీ తాత ఇస్తాడా?" గదమాయించింది.

"రెండు వేలు పట్టుకొచ్చా. కొత్త నోట్లు." కంచంలో పెట్టాడు.

"ఆమ్మో! నోట్లు తడిసిపోవూ?" ఆరాటంగా తీసుకుంది సుందరమ్మ.

"అయితే ఇక వస్తా." భీమేశ్వరావు లేవలేదు. కూర వాసన గుబాళిస్తూంది.

'తినిపోదువుగాని కూచో' అనలేదు సుందరమ్మ. "ఎప్పుడొస్తార్రా?" అంది.

"తెల్లారి."

ఎప్పుడు తెల్లారుతుందో, ఎప్పుడు ఆ ఉద్యోగం చేసే అమ్మాయిని చూస్తానో అనుకున్నాడు చెన్నకేశవరావు.

ఆ రాత్రంతా నిద్ర పట్టినా రక రకాల కల లొచ్చాయి. ఆ పిల్ల ఉద్యోగం మానిపించి తను పెళ్ళిచేసుకున్నాడో, పెళ్ళిచేసుకొని ఉద్యోగం మానిపించాడో (కలలో) గుర్తులేదు.


గడియారం తొమ్మిది కొట్టేంత వరకూ లేవలేదు. అప్పటికి ఒక లారీతో సామానులు, కార్లో జనం రావటం కూడా జరిగింది.

ఒకసారి ఇంటి యజమాని హోదాలో వెళ్ళి చూసొచ్చాడు.

"ఏరా, ఎలా ఉన్నారు?" అంది సుందరమ్మ.

చిన్నప్పుడు స్కూల్లో 'కత్తి గొప్పదా, కలం గొప్పదా' అన్న అంశం మీద అందరూ తలోక రకంగా వాదించినప్పుడు చెన్నకేశవరావు తేల్చి చెప్పేశాడు, కలం కన్నా, కత్తికన్నా రివాల్వర్ గొప్పదని.

ఇప్పుడు డాబా ఇంటికి కొత్తగా వచ్చిన సాంబశివరావుగారికి వస్తువాహాల్లో జోడుగుళ్ళ తుపాకీ కనిపించింది.



"ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఈ ఇరవై నాలుగు పరగణాల్లో అంతకన్నా గొప్పోళ్ళు లేరే, అక్కా." బయటినుంచే భీమేశ్వరరావు కంచుకంఠం మారోగింది."

"అసలు జడ్జిగారు మా ఊళ్ళో సరైన క్రిమినల్ లాయరు లేడు, మీరు రండని ఆహ్వానించాడట. అమ్మాయేమో బి. టి. స్కూల్లో టీచరమ్మ పని ఏదో ఉబుసుపోక చేస్తూంది. అదీ జడ్జిగారే వేయించి ఉంటారు."

తన బావమరిదికి లా కాలేజీలో సీటు ఇక సమస్య కాదనుకున్నాడు లోపల భోజనం చేస్తున్న సోమేశ్వరం. తన భార్య ఐడియా ఇవ్వకముందే చెప్పేశాడు.

"మీ అమ్మగారితో అనకండి, పడ నివ్వదు. రెండు మూడు రోజులు పోయిన తరవాత కదిపి చూడండి. ఇల్లు గల వాళ్ళకి ఆమ్రాతం చెయ్యరా?" అంది భర్తగారితో.

కాస్త దెబ్బతిన్నది చెన్నకేశవరావే. వీదో ఒక మోస్తరు కుటుంబం. ఆ అమ్మాయి గతిలేక ఉద్యోగం చేస్తూంది. అద్దె సకాలానికి ఇవ్వకపోతే సర్దుకుపోతూ అడపాదడపా ఆ కుటుంబాన్ని ఆదు

## ఎస్. ఎస్. లాల్

కుంటూ చొరవ చేసుకొని ఆమె మన సులో చొప్పుకుపోదా మనుకున్నాడు.

కథ ఎదురు తిరిగేట్టుంది. పైగా ఆ అమ్మాయి బి. టి. ! తను బి. ఎ. పూర్తిచేసి చావలేదు.

ఎటు చూసినా పొత్తు కుదరటంలేదు. అయినా అప్పుడే ఓటమిని అంగీకరించ లేదు. అన్నిటికన్న తన మన్మథ స్వరూపం ఉందే! ఆ పెర్సనాలిటీకి ఏ ఆడదయినా దాసోహం అనాలిసిందే. పైగా ఆర్టిస్టు! స్టూడియో పెట్టి ఫొటోలు తీసి ఎంతమంది అమ్మాయిల్ని మెప్పించ లేదు! ఎంతమందికి ఆయిల్ పెయింటింగ్స్ ప్రెజెంట్ చెయ్యలేదు! ఏదో ఒక అస్త్రం పని చెయ్యకుండాపోతుందా అనుకున్నాడు.

"ఓవర్ హెడ్ టాంక్ కట్టించమని, పైపులు కొనమని వెయ్యి ఇచ్చాడేఅక్కా." సుందరమ్మ చేతికి డబ్బు ఇస్తూ అన్నాడు, భీమేశ్వరరావు.

"మోటారుకివవడిస్త్రా నీ తాత?" వాడి తాత గారు, తన తాతగారు ఒక్కడే అన్న సంగతి ఎందుకు మరిచిపోయిందో సుందరమ్మ?

"ఇది అద్వాన్స్! మూడువేలకి తెక్కోచ్చా" సగర్వంగా ఆకాశంలోకి చూశాడు భీమేశ్వరరావు.



ఆ రాత్రి, వెన్నెల ఆకాశంలో తెల్లని మబ్బుల గుంపు క్రికెట్ ఆడుకుంటున్నాయి.

చెన్నకేశవరావు జీవితంలో ఏదీ అను కున్నది అనుకున్నట్లు జరగదు.

( పై రిమార్కు పాఠకులు — అంటే ఈ కథ సాంతం చదవదలుచు కున్న వాళ్ళు మరిచిపోవాలని నా ప్రార్థన. ఎందుకంటే, సస్పెన్సు పోతుంది ).

ఏదో పనిమీద డాబా మీది కొచ్చి, ఎందుకో అటువేపు చూశాడు. అవతల డాబా మీద తెల్లటి చీరలో ( సినిమాల్లో దయ్యం డ్రెస్సు ) ఆమె కనిపించింది. పాలమీద తేలే మీగడలా ఉంది. ఈ ఆడదానికి ఇంత అందం పూరిపోసి నందుకు ఆ సృష్టికర్తను తిట్టుకున్నాడు. ఇటువంటి అందాలు చూడబట్టే రవి వర్మ, రెంబ్రాంటూ అంత గొప్పవా ళ్ళయ్యారు. ఇంకొక గొప్పవాడు చావనే కోసుకున్నాడు.

ఆమె అతనికేసి కన్నెత్తి చూడలేదు. తెరమీద బొమ్మలా దిగి వెళ్ళిపోయింది. చాలాసేపు అక్కడే, అలాగే ఉండిపోయాడు తన గాలిమేడల్లో తేలిపోతూ.

మరునాడు ఓవర్‌హెడ్ టాంక్ గురించి చర్చించటానికి డాబా ఇంటి కెళ్ళాడు. సాంబశివరావుగారు కాఫీఅయినా ( ఆ అమ్మాయి చేత్తో ) ఇప్పించకుండా పంపించేశాడు, ఏదో మాట్లాడి. ఆమె గొంతయిన ఓవర్ హియర్ చెయ్యలేక పోయాడు.

చాలా నీరసంగా తన రవి కళామందిర్ ఫోటో స్టూడియోలో కాళ్ళు ముడుచు కుని కూర్చున్నాడు, మళ్ళీ రాత్రికోసం ఎదురుచూస్తూ.

"ఓ... మీరేనా ..." అన్న స్త్రీ కంఠం సంగీతంలా వినిపించింది.

ఆ స్టూడియోకి ఛాలా మంది ఆపో జిట్ సెక్సు వస్తుంటారు.

'అవును, నేనే' అందా మనుకొని మౌనంగా చూశాడు.

"మీకు ఫోటో స్టూడియో ఉందని నాకు తెలియదండి." ఈ పరామర్శ కూడా వింతగానే ఉంది.

ఆమె సమాధానంకోసం నిరీక్షించ కుండా ఎదురుగా ఉన్న ఒక పెయింటింగ్ దగ్గరి కెళ్ళింది.

ఎవరైతేనేం, వ్యాపార రీత్యా మాట ల్లోకి దిగాడు. "ఈ పోర్ట్రెయిట్ ఉంది చూశారూ, ఈవిడ వయ సెంతో చెప్పండి?"

"దాదాపు పదహారు."

"కాదు. ముప్పై రెండో పెళ్ళికి ఫోటో తీయించుకొన్ని చిన్న పిల్లలా పెయింట్ చేసి పెట్టమంది. చేశాను."

నేను నక్సలేనా అన్నట్లు చూశాడు.

"వండర్‌ఫుల్!"

ఆ అమ్మాయి కూడా వండర్‌ఫుల్లే! కాని, రాత్రి చూసిన అమ్మాయిలా లేదు.

"మరి మీకు ఇటువంటిదేం అవసరం లేదనుకుంటాను. ఎందుకంటే, మీ వయసు ఇరవై దాటక పోవచ్చు." కాంప్లి మెంట్ చేశాడు.

"నన్నొక ముసలమ్మలా పెయింట్ చేసి పెట్టండి."

"రిడిక్యులస్. నాకు చేతులు రావండి. అసలు ఆ భగవంతుడు ఆడవాళ్ళను ఎందుకు ముసలివాళ్ళను చేస్తాడో? నాకు చెడ్డకోపం."

ఆమె చాలా సరదాగా నవ్వింది.

"ఒకసారి మా ఇంటికి రండి. మీతో పాతకాలంగా మాట్లాడాలి."

ఆమె లేచి రెండడుగులు వేసింది.

"అరె, మీ అడ్రెసు చెప్పనేలేదే?!" చెన్నకేశవరావు ఆమె దారికి అడ్డం వచ్చాడు.

"రిడిక్యులస్. మీ ఇంటి అడ్రెసు మీకు చెప్పాలా?"

"ఓ ... ఓహో! అంటే, మీరు మా డాబా ఇంట్లో కొత్తగా వచ్చిన ..."

"అబ్బ, చాలా స్లో సార్ మీరు. నన్నెప్పుడూ చూడలే?"

"లేదండీ."

"మరి రాత్రిళ్ళు డాబా మీద గంటల తరబడి చూస్తుంటారే ..."

అవును, ఈ అమ్మాయీ తెల్లచీరే!

"మై డియర్ గాడ్! !!" ఎవరో వీపు మీద చరిచినట్లయింది.

ఆమె వెళ్ళిపోయింది.

సాయంత్రం వరకూ షాక్ నుంచి తేరుకోలేదు. స్టూడియో మూసి తిన్నగా తన ఇంటికే వెళ్ళి చక్కగా స్నానం చేసి, ఆడపిల్లలా ముస్తాబై డాబా ఇంటి కెళ్ళాడు.

సరిగ్గా అతను అనుకున్నట్లే జరిగింది. సాంబశివరావుగారే తలుపు తీశారు. కనీసం ఆమె నీడయినా కనిపించలేదు.

పనిమనిషి కాఫీ తెచ్చి ఇచ్చింది.

కాసేపు నుంచి చెడ్డా మాట్లాడు కున్నారు. కేశవరావు సహనం క్షీణి స్తూంది. గట్టిగా అరిచేసి అతన్ని బయ టికి నెట్టాలనిపించింది.

లాభం లేదు. చాలా తాపీగా కూర్చు న్నాడు. "నెల పూర్తికాగానే అద్దె పంపి స్తాను. టాంక్ పని త్వరగా పూర్తి చెయ్యండి" అన్నాడు ఆయన.

"సరేనండి." చాలా వినయంగా సమా ధానం చెప్పి బయటికి వచ్చేశాడు.

తన మేకప్ అంతా నేస్ట్ అయినం దుకు బాధపడక తప్పలేదు.

రాత్రి డాబా మీద కనిపిస్తే ఏ దయినా తొసిగ్నల్ పారెద్దామనుకున్నాడు. రాలేదు.

మర్నాడూ స్టూడియోకి రాలేదు. చిర్రెత్తు కొచ్చింది. ఆడజాతి మీద అసహ్యం వేసింది. స్టూడియో మూసి వస్తుండగా కారొచ్చి ఆగింది. అతను, పాపం! తలన్నా దువ్వుకోలేదు. శరీర మంతా దుర్గంధం! చాలా సిగ్గుపడి పోయాడు.

"కారెక్కండి."

ఆమె డ్రైవ్ చేస్తూంది. మరి మన సంప్రదాయం వెనక సీట్లో కూర్చో మంది.

"డ్రైవర్‌లాగా వెనక ఎందుకులెండి! ముందుసీట్లో కూర్చోండి," మంద లింపులా వినిపించింది ఆమె గొంతు.

అప్పటికిగాని తన స్వప్నాన్ని గుర్తించ లేకపోయాడు.

ఇంటిముందు ఇంటివొచ్చి దాపేలు తాగేంతవరకూ పెద్ద మాటలు సాగ లేదు. ఈ లోగా సాంబశివరావుగారి చిత్ర రంగం మీదికి దండయాత్ర చేస్తుందని బెంగపడి పోతున్నాడు.

"ఇదిగో చూడండి. ఇది ఫోటో తీసి ముప్పై ఏళ్ళ నాడిలా చూపించ గలరా?" లోపల ఉన్న పొట్టిగాణ్ణి చూపించి అడిగింది.

"మీ తమ్ముడాండీ?" కుర్రాణ్ణి పరిశీలిస్తూ అడిగాడు.

పకపకా నవ్వింది. "భలేవారే! నా పుత్రరత్నమండీ. నేను విధవని. వీడు కడుపున పడగానే వాళ్ళ నాన్నని పంపే శాను."

చెన్నకేశవరావుకి అది కలో, వైష్ణవ మాయో అర్థంకాలేదు.

తల ఆడించి లేచి వచ్చేశాడు. ఆ రాత్రంతా తల బద్దలు కొట్టుకున్నాడు. తన తలరాత అలా రాసిపెట్టి ఉందన్న మాట. విధవని పెళ్ళిచేసుకుంటే ఈ లోకం, ఇప్పటికీ 'విధవా' అని పిలిచే అమ్మ ఏమంటారు? !

మొత్తంమీద తన ఊహల్లోంచి ఆమెను మైనస్ చేసుకోలేక పోయాడు. తన ప్రేమ కథ సినిమాకి పనికొస్తుం దనుకొన్నాడు. కాని, ఇలా ఐటెంగా తయారౌతుం దనుకోలేదు.

"హౌలాంగ్ షి విల్ లివ్ లైక్ దిస్?" అంటే మొగుడూ మొద్దూ లేకుండా ఆ పొట్టిగాణ్ణి సాకుతూ ముసలమ్మయి పోతుందా? అబ్సర్డ్!

ఇల్లూ వాకిలీ అమ్మేసి తన జీవిత చరిత్ర సినిమా తీసి చూసుకున్నాడు ( అంటే విడో మేరేజ్ ). థియేటర్లో ఈగలు ముసురుతున్నాయి. తనకే స్ఫురించింది. ఈ ఊరినుంచి వెళ్ళి పోయి ఆమె మెడలో తాళి కట్టేస్తే ఏ గొడవా లేదు. అలా సిటీ వెళ్ళిపోవా లంటే అవాంతరాలు చాలా ఉన్నాయి. ముసల్ది అమ్మ చచ్చిపోవాలి. అన్నకు పిచ్చె క్కాలి. ఇలా అతని తలనుంచి పొగలూ సెగలూ పైకి రాగా కొన్ని ప్రశ్నలు — అంటే ఆమెను అడగవలసిన ప్రశ్నలు పుట్టుకొచ్చాయి.

మచ్చుకు: మీరు మీ హజ్బెండ్‌తో ఎన్నాళ్ళు కాపురం చేశారు?

( అసలు అతను అడగవలసింది ఎన్ని రాత్రులని. )

చెప్పుచ్చుకుంటుందేమో? చాలా కొన్ని చిన్న చిన్న రాత్రులని అతనే సమా ధానం చెప్పుకున్నాడు.

# వీడ్కోలు

## కౌసల నాగభూషణం

వెళ్ళిపోయే 'ఆనంద'కు
వీడ్కోలు మహాసభలు.
అశేషాంధ్ర ప్రజానీకమూ
ఏకకంఠంతో ఆమోదించిన ముసాయిదా
ఈ రమ్య ప్రభాతంలో
'రాక్షసం'గా ప్రకటింపబడుతూంది.
జనతా వేదిక మీద
నా వినిపించిన అధ్యక్షోపన్యాసం
ఆకాశం అంచుల నుంచి
డగ్గుత్తికతో ప్రతిధ్వనించింది!
"సమసే చీకటి
పొడిచే వేకువ
ఆనందా!
నీ నిష్క్రమణం ఈ రెంటి నడుమ
అస్పష్టంకాని అభిధేయంతో
అడుగడుగునా అలమటించావు.
కలిసిరాని కాలానికి
పాపం! ప్రతీకవు
మనుష్యమాత్రం ఏం చేస్తావు?
కలగంట్లనే మిగిల్చినా
కడపటి క్షణంలో నయినా
నవజీవన భావోదయానికి
రమణీయ వ్యాఖ్య నందించావు
కృతజ్ఞులం.
అందాకా నేనుంటే
అరవయ్యేళ్ళ తర్వాత
స్వాగతమే అందిస్తాను
మరి ఇప్పటికి సెలవ్."

☆

"నన్ను పెళ్ళిచేసుకుంటే ఆ బొట్టిగాణ్ణి మీ ఫాదర్ దగ్గర వదిలేస్తారా?" ఇది మరో ప్రశ్న.

బహుశా ఒప్పుకోవచ్చు.

అసలు తనకు పెళ్ళికాలేదని, వాడు తన తమ్ముడని అబద్ధం చెప్పేస్తే తన మనస్సు ప్రస్తుతం ఎంత హాయిగా ఉండేది!

ఏ మయినా ఆ పిల్ల నిజాయితీకి చాలా మార్కులు ఇచ్చాడు.

తెల్లవారుతూండగా ఒక తరణోపాయం తళుక్కున మెరిసింది.

పెళ్ళీ గిళ్ళీ లేకుండా ఏదో చీకటి సంబంధానికి రాజీపడుతుం దనుకున్నాడు. దానితో నిద్ర పట్టింది.

లేటుగా పదిన్నరకి లేచాడు. ఇంట్లో ఎంతమంది లేచినా లేవలేదు. వాళ్ళమ్మ నీళ్ళు చల్లింది.

మళ్ళీ కళ్ళు తెరిచే నిద్రపోతూ రాత్రి తను తీసుకున్న నిర్ణయం గురించి పునశ్చరణ చేసుకున్నాడు. చాలా వికారంగా ఉంది.

"వెధవా, లేస్తావా లేదా?" తల్లి ప్రేమ పన్నీటి జల్లులా కురిసింది (మరో గ్లాసు నీళ్ళు).

స్టూడియో తీసిన అయిదు నిమిషాలకి ఆమె కార్లోంచి దిగింది.

"మూడుసార్లు వచ్చానండి. ఈ వేళ ఇంత ఆలస్యంగా వచ్చారే?"

నిట్టూర్చాడు.

ఆమె వెంట బొట్టిగాడు కూడా వచ్చాడు.

"అసలు మీ కెందుకు ముసలి ఫోటో?"

"నాకు కాదు, కుర్రాడికి."

"ఎందుకు?"

"వాడు అచ్చం వాళ్ళ నాన్న పోలిక. వాళ్ళ నాన్నగారి ఫోటోలు నా దగ్గర లేవు. రేపు పెద్దవాడై 'మా నాన్న ఎవ'రంటే?"

ఆమె సమాధానం తుపాకి గుండులా దూసుకుపోయింది, అతని హృదయాన్ని.

'మీకు మీ భర్త అంటే అంత ప్రేమన్నమాట?' అని అడగా లనుకున్నాడు. గొంతు పెగల్లేదు.

నిర్లిప్తంగానే బొట్టిగాడి ఫోటో తీశాడు. తనకు ఇంటరెస్టు లేని ఎఫైర్ అయిపోయింది ఇరవై నాలుగుగంటల్లోనే.

తన భావనలో ఆమె రూపం క్వశ్చెన్ మార్కుగానే మిగిలిపోయింది. ఒకటి రెండు సార్లు మళ్ళీ స్టూడియో కొచ్చినా ఆసక్తి చూపించలేకపోయాడు.

కొన్ని రోజులూ, నెలలూ వేసవి కాలంలో ఐస్‌క్రీమ్‌లా కరిగిపోయాయి. ఒక రోజు రాత్రి, అంటే బొట్టిగాడు చనిపోయిన రాత్రి రెండు గంటలకి ఆమె తన ఇంటికి వచ్చింది.

"ఇంట్లో ఎవరూ లేరు. బాబుకి సీరియస్‌గా ఉంది. కాస్త వస్తారా?" అంది.

అప్పయ్య వదినతో గదిలో పడుకున్నాడు. అమ్మ లేచింది వస్తానంటూ.

"డాక్టర్ని పిలవాలి. మన బండి ఉంది, అడ్రెసిస్తాను." మీకు డ్రైవింగ్ వచ్చా?"

రాదని చెప్పలేక పెదవి విరిచాడు.

"సరే, నేను వెళ్ళొస్తాను, మీరూ, అమ్మగారూ బాబుదగ్గ రుండండి."

"అక్కర్లేదు. టెలిఫోన్ నంబర్ ఇవ్వండి. పక్కనే ఫోన్ ఉంది." ఒడిపోవటం ఇష్టంలేక అలా ప్రపోజ్ చేశాడు.

డాక్టర్ వచ్చేలోగా కుర్రాడి మొహం తెల్లగా పాలిపోయింది.

"సాంబశివరావుగారికి టెలిగ్రామ్ ఇవ్వక పోయారా?"

"ఇచ్చానండి. ఉదయం మెయిల్లో వస్తారు."

ఆయన రాకముందే కుర్రాడు చనిపోయాడు.

ఆ సంఘటన తరవాత ఆ ఇంటికీ, ఈ ఇంటికి రాకపోకలు పెరిగాయి. "మహాలక్ష్మిలాంటి పిల్ల" అంది వాళ్ళమ్మ. "నా కోడలయితే బాగుండును" అని వాళ్ళమ్మ చెప్పినట్లయితే చాలా సంతోషించే వాడేమో!

అలాంటి మరికొన్ని నిట్టూర్పుల్లోంచి ఒక కొత్త ఆలోచన రాకెట్‌లా వచ్చింది. బొట్టిగాడి ఫోటో తన దగ్గరుంది. దాన్ని ఎన్‌లార్జ్ చేసి, మంచి ఫ్రేమ్ కట్టి, ఆవిడకి ప్రెజెంట్ చేస్తే చాలా సంతోషిస్తుందనుకున్నాడు.

సాయంత్రానికి పని పూర్తిచేసుకొని డాబా ఇంటి కెళ్ళాడు.

"ఏదో తెచ్చినట్టున్నారు?" నవ్వుతూ పలకరించింది.

చెప్పాడు.

చచ్చిపోయిన తన బాబు లేచొచ్చినంత సంతోషిస్తుం దనుకున్నాడు.

చిరునవ్వు నవ్వి ఊరుకుంది.

"గోడకి తగిలించమంటారా?"

"వద్దంటే ... నాకు ఇద్దర్లో ఎవరూ దక్కలేదు ... మరిచిపోవాలని ప్రయత్నిస్తున్నాను" అంది క్లుప్తంగా.

ఆ రెండు వాక్యాల్లో ఎంతో అర్థం వినిపించింది కేశవరావుకి.

అంటే, ఆవిడ పాత జీవితానికి గుడ్‌బై చెప్పి కొత్త జీవితానికి స్వాగతం చెబుతుం దన్న మాట. ఇదే సందనుకున్నాడు.

చీమలు నడవగా నడవగా బండిరాతి మీదయినా దారి పడుతుం దన్నారు పెద్దలు. చెప్ప కేశవరావుకి నిజంగానే మది కొంత కాలానికి దారి పడింది.

ప్రస్తుతం రోజూ కలుసుకుంటున్నారు. ఆమె చేత అప్పుడప్పుడూ మ్మాలుకూడా మానిపించేస్తున్నాడు. సాంబశివరావుకూడా అడ్డు రావటం లేదు. చూసీ చూడనట్టు ఒప్పుకుంటున్నాడు.

"ఈ వేళ పిక్చర్‌కి మీ ఫాదర్ని పిలుద్దాం." ఏదో రామాయణం తాలూకు సినిమా కాబట్టి, ప్రేమసుట్టాలూ అవి చాలా లైట్‌గా ఉంటాయనే అభిప్రాయంతో ఆ అఫర్ ఇచ్చాడు.

"ఫాదరా?!" చాలా ఆశ్చర్యంగా చూసింది.

ఎప్పుడూ ఆయన్ని సాంబశివరావుగా రనే పిలుస్తాడు. "అవును, ఫాదరే." రెట్టించాడు.

"మా ఫాదర్ పోయి కొన్ని యుగాలైంది, మిస్టర్."

"సాంబశివరావుగారు పోయారా?" రెండు రోజుల క్రితం చూసినట్టు గుర్తు.

"ఓహో ... అలాగా! అయితే, మీకు సాంబశివరావుగారు మా ఫాదర్ కాదని తెలియదన్న మాట?"

'ఫాదర్' అనే పదానికి అర్థం 'తండ్రి' అవునో కాదో ఒక్కసరి వెతుక్కున్నాడు మనసులోనే.

"అయితే, ఏమవుతారు?"

అతని మొహం కందగడ్డలా మారిపోయింది.

"నా వెల్ విషర్. నేను ఇష్టపడితే నన్ను పెళ్ళిచేసుకోవా లనుకుంటున్నారు."

"అయితే, మీరు ఇష్టపడటం లేదా?"

"ప్రశ్నలన్నీ మీరే వేస్తున్నారు. నేనొక ప్రశ్న మిమ్మల్ని అడగనా?"

అడగమన్నట్టు చూశాడు.

"నన్ను పెళ్ళిచేసుకోవాలనే అభిప్రాయం మీకుంది గదూ?"

"అవును ... ఉంది." నిస్సంకోచంగా అన్నాడు.

"మీ ఫాదర్ ఒప్పుకుంటారా? అసలు నా కథ చెబుతాను, వినండి."

చాలా డాషింగ్‌గా అంది. గోడమీద తుపాకీ చూసి 'తుపాకిలాంటి పిల్ల' అనుకున్నాడు.


"అసలు మా ఫాదర్ మిలిటరీలో పనిచేసేవారు."

"ప్లీజ్, సీతా! నేనేం వినదలుచుకోలేదు. మా మదర్‌తోనూ నువ్వేం చెప్పకు."

"మీ మదర్‌కి అన్నీ తెలుసు."

గుండె దెబ్బతిన్న పిట్టలా తన్నుకున్నాడు.

"ఎలా?!"



జంట
చిలుకూరి ఆంజనేయులు
(కరీంనగర్)

"ఏదో మాటల మధ్య అడిగితే నేనే చెప్పాను."

"ఎంతపని చేశావ్!"

తల రెండు చేతుల మధ్యా దాచుకున్నాడు.

తరవాత ఆమె మాట్లాడలేదు. అతనూ మాట్లాడలేదు. అంటే, తేల్చి చెప్పమని అల్టిమేటమ్ ఇచ్చిందన్న మాట. ఇప్పుడు సాంబశివరావుగారు తనకి రైవల్. ఆమె సంగతులన్నీ మామూలుగా ఎందుకు ఉండవో, తను ఊహించని, కలలో నయినా తలంచని విషయాలు ఎందు కలా జరుగుతున్నాయో, అది తన జాతక ప్రభావమో నిర్ణయించుకోలేకపోయాడు.

రాత్రిళ్ళు సాంబశివరావుగారు ఎక్కడ పడుకుంటాడో? పనిమనిషికి పండగ పేరుతో అయిదు రూపాయలిచ్చి అడిగాడు.

"ఆరు మొగుడూ పెళ్ళాలు కాదుగా? ఇడిఇడిగా తొంగుంటారు" అంది.

ఆమెను పూర్తిగా మరిచిపోవాలని రెండు రోజులు కృషి చేశాడు. సిగరెట్ మానాలని ప్రయత్నించి, అల్లాడిపోయి, చివరికి ఒక్కసారిగా రెండు సిగరెట్లు కాల్చేవాడిలా — "ఆవిణ్ణి పెళ్ళి చేసుకుంటా నమ్మా" అన్నాడు.

"ఏవిణ్ణిరా?" అంది నిజంగానే అర్థంకాక.

"మన డాబా ఇంట్లో ఉన్న సీతని."

పురాణంలో సీత అనుకుంటుందని వివరంగా చెప్పాడు.

"ఆ వెధవ ముండనా? నీకేం పోయే కాలం రా, వెధవా!" చాలా లైట్‌గా అనేసి వెళ్ళిపోయింది.

"నా చెల్లిని వద్దన్నందుకు మా అమ్మ రోగం ఇట్టాగే కుదరాలి" అంది వాళ్ళ వదిన అన్నగారితో.

తన పెళ్ళాం కంటే అందమైన పిల్లని కొట్టేస్తున్నందుకు కాస్త అసూయ పడ్డాడు.

అలాగే రోజూ అందరితో మాట్లాడుతూ వచ్చాడు కేశవరావు. ఎవరూ పట్టించుకోలేదు. కోపం చంపుకోలేక నిద్ర మాత్రలు స్లీపింగ్ టాబ్లెట్స్ మింగేశాడు.

చాలా గల్లంతయిపోయింది. డాక్టర్ "హోప్ లెస్" అన్నాడు.

చుట్టాలందరికీ 'పెళ్ళిగాకుండా వెళ్ళి పోయాడు.' వార్త వినగానే చుట్టాలంతా పెళ్ళికొచ్చినట్టు వాలిపోయారు. కేశవరావు వదిన అందరితో రహస్యంగా ఆత్మహత్యాకారణం ( చాలా వరదాగా ) చెప్పింది. అందరికీ విడ్డూరంగా తోచింది.

చివరికి చెన్నకేశవరావు శరీరం మట్టిలో మట్టి కాలేదు. పదమూడో రోజు నీరసంగా కళ్ళు తెరిచాడు.

తనెక్కడున్నదీ తెలుసుకున్నాడు. వాళ్ళమ్మని ఏడవద్దని చేతో చెప్పాడు. ఏడవలేదు కాబట్టి సీత కేం చెప్పలేదు.

అన్నపానాలు నోటి ద్వారా ఇవ్వటం ప్రారంభించారు డాక్టర్లు. మాట్లాడే శక్తి వచ్చింది.

సాంబశివరావుగారు ఒక రోజు వచ్చారు. ఆయన వాసన తనకి గిట్టలేదు. మాట్లాడే శక్తి ఉన్నా కళ్ళు తెరిచి, నీరసంగా చూసి కళ్ళు మూసుకుని నిద్ర నటించాడు.

"మీతో ఒక విషయం మాట్లాడదా మని వచ్చాను. నేను రెండు మూడు రోజుల్లో ఇక్కణ్ణుంచి వెళ్ళిపోతున్నాను."

కళ్ళు తెరిచాడు పెద్ద రిలీఫ్ తో.

"మరేం లేదు. ఇప్పటికే ఒకసారి ఆ పిల్ల బతుకు పాడైంది. మళ్ళీ దాని జీవితం పాడుచెయ్యకండి. మీరు నిజంగా పెళ్ళిచేసుకుని ..."

"అవునండీ. పెళ్ళిచేసుకోవా లనుకుంటున్నాను. ఆమె కూడా ఇష్టపడింది." దృఢంగా చెప్పాడు.

"కంగ్రాచ్యులేషన్స్!" కరచాలనం చేసి వెళ్ళిపోయాడు.

దానితో వెయ్యేనుగుల బలం వచ్చింది కేశవరావుకి. వాళ్ళమ్మతో కచ్చితంగా చెప్పేశాడు.

"నిద్ర మాత్రలు మింగి మా నోళ్ళు మూయించావు కదరా?" కళ్ళు తడిచేసుకుంది.

"శుభమా అని ..." ఏడవద్దని గదమాయించాడు. కోపంతో అతని గొంతు పూడుకుపోయింది.

ఆస్పత్రినుంచి తిరిగొచ్చి పరామర్శ కోసం దాదా ఇంటి కెళ్ళాడు.

సీతకాస్త ఛియర్ ఫుల్ గా నే కనిపించింది. ఆమెను మరింత సంతోషపెట్టాలని అన్నాడు: "మన పెళ్ళి వచ్చే నెల ఫిక్స్ చేశాను."

ఆమె ఎందుకో కొయ్యబారిపోయింది. కాస్సేపు చలనం లేదు. చివరికి అంది: "మన పెళ్ళి గురించి సాంబశివరావుగారు ఏమయినా మీతో మాట్లాడారా?"

"కంగ్రాచ్యులేట్ చేశారు. ఏంటి?"

"నా గురించి ఏమేం చెప్పలేదా?" చాలా ఆదుర్దాగా చూసింది.

"లేదు."

గోడకు తగిలించి ఉన్న తుపాకీ కేసి చూసింది. జ్యోతుల్లా ఎర్రబడ్డ ఆమె కళ్ళు చిన్న కన్నీటి పొర కప్పుకొని చల్లబడ లేదు. తల తిప్పుకొని లోపలి కెళ్ళి పోయింది.

అర్థం కాలేదు. లోపలి కెళ్ళి ఓదార్చాలని ప్రయత్నించాడు. "మీరు కాస్సేపు హాల్లో కూర్చోండి, వస్తాను" అంది.

అలాగే ఒక గంట తరవాత ముఖం కడుక్కొని, జుట్టు చేత్తో సరిచేసుకుని అతని కెదురుగా కూర్చుంది.

"మన కథ ఇంత దూరం వచ్చిన తరవాత నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోనని చెప్పి మీ మనసు నొప్పించడం, మిమ్మల్ని ఒక రకంగా అవమానించడమే అవుతుంది. ఇంతకుపూర్వం ఒకసారి నా గురించి చెబుతా నన్నాను. మీరు వినలేదు. నా బిడ్డని తమ్ముడనుకున్నారు. నాతో ఉంటున్న మరో వ్యక్తిని తండ్రి అను కున్నారు. అంటే, మీరే కొన్ని నిర్ణయాలకి వచ్చేశారు.

"మీరు సూయిసైడ్ ఎటెమ్ట్ చేసేంతవరకూ నేను మీ గురించి సీరియస్ గా అనుకోలేదు. పొరపాటే ... ఇప్పుడు మీకు కొన్ని విషయాలు చెప్పక తప్పదు. నా కొంత పెద్ద కథ చాలా క్లుప్తంగా చెబుతాను.

"మా నాన్న ఒక మిలిటరీ ఆఫీసర్ దగ్గర బట్లర్ గా పనిచేశారు. మగ సంతానం లేదు. నన్ను బాగా చదివించా లని ఆయన జీవితాశయం. చదివించారు. కాని, నేను కాలేజీలో ప్రవేశించగానే ఆయన ఒక ఏక్సిడెంట్ లో చనిపోయారు. ఇన్స్యూరెన్సూ, ఫండ్సూ మొత్తం అయిదువేలొచ్చినా ఏం సరిపోతుంది? చదువు మానేయ్యాలనుకున్నాను. కాని, బాబ్జీ అని నా క్లాస్ మేట్ మా ఇంటి పక్కనే ఉండేవాడు. మా కుటుంబ విషయాలన్నీ తెలుసు. నన్ను చదువు మానవద్దన్నాడు. మా అమ్మ ఏదో సహాయం చేస్తున్నాడు గదా అని ఊరు కుంది. అతని డబ్బుతోనే బి. ఎ. పూర్తి అయింది. ఎమ్. ఎ. చదవ మన్నాడు. నే నతని మాట వినకుండా బి. టి. చదివాను. ఈ లోగా మా అమ్మ చనిపోయింది. ఆ తరవాతే నా కష్టాలు ప్రారంభ మయ్యాయి.

"బాబ్జీ స్వంత ఊరు అక్కడికి ఏభై మైళ్ళ దూరంలో ఉన్న పల్లెటూరు. శనివారం మధ్యాహ్నం వెళ్ళి సోమవారం ఉదయం వచ్చేవాడు.

"రెండు రోజులు అమ్మలేకుండా, బాబ్జీ లేకుండా ఒంటరిగా ఉండలేక పోయేదాన్ని.

" 'బాబ్జీ! మనం పెళ్ళిచేసుకోక తప్ప దనుకుంటాను' అన్నాను.

"ఎందుకు?" ఎదురు ప్రశ్న వేశాడు.

"మరో చిన్న బాబ్జీని నీకు ప్రజెంట్ చెయ్యబోతున్నాను' అన్నాను.

"డియూక్స్ కాలేదు బాబ్జీ. చాలా సాధారణంగా వెళ్ళిపోయాడు.

"మళ్ళీ మరో రోజు గట్టిగా అడిగాను.

" 'మన పెళ్ళి కుదరదు, సీతా' అన్నాడు.

"అతని ప్రవర్తన నిర్వికారంగా, చాలా సాధారణంగా, ఏదో కాఫీ వద్దన్నట్టు నన్ను తీసి పారెయ్యడంతో నా రక్తం పొంగింది.

" 'మరెందుకు నాతో ఈ నాటకం?' అన్నాను ఏ ముంది? మా ఆవిడ ఇక్కడ లేదు కాబట్టి నువ్వు అన్నాడు. నీకు పెళ్ళైందా? ! నాతో చెప్పలేదేం? ! అతని చొక్కా పట్టుకున్నాను. నీతో చెప్పడానికి నువ్వేమన్నా తాళికట్టిన పెళ్ళా నివా? అసలు తాళికట్టిన దానితోనే చెప్పటం లేదు అని లేచి వెళ్ళిపోబోయాడు. మా నాన్న రైఫిల్ గోడమీద ఉంది. అది తీసుకుని అతని దారికి అడ్డంగా నించున్నాను. అదంతా పెంకితనమో ఏదో బెదిరించాలనే. అది లోడ్ చేసి ఉన్న తుపాకీ అని, ట్రిగ్గర్ నొక్కితే అతను చనిపోతాడని నాకు తెలియదు. నన్ను విడిచిపెట్టి వెళ్ళితే కాల్చేస్తా నన్నాను. నవ్వి నన్ను పక్కకి నెట్టేశాడు. అప్రయత్నంగా నా వేళ్ళు ట్రిగ్గర్ నొక్కాయి. డబుల్ బారల్ కావడం వల్ల నాకూ దెబ్బతగిలింది. కాని, నేను చచ్చిపోలేదు. కళ్ళు తెరిచి చూసేసరికి బాబ్జీ రక్తంలో పడి కొట్టుకుంటున్నాడు. కళ్ళునమ్మలేం నన్నే చూస్తున్నాయి, ఎంతపని చేశావ్ అన్నట్టు.


"తరవాత హత్యానేరం నా మీద మోపబడింది. నాకు బాబు జైల్లోనే పుట్టాడు. సాంబశివరావుగారే నా లాయరు. అలా ఆయన నాకు పరిచయ మయ్యారు.

"నేను ఆదిలోనే ఒక పొరపాటు చేశాను. మా నాన్నగారు పోగానే నా శక్తిని మించిన వాణ్ణి చేసుకుని సరిపెట్టు కుంటే నా జీవితం సుఖంగా సాగి పోయేది. బాబ్జీ డబ్బున్నవాడు, చదువు కున్న వాడని ఆశపడ్డాను.

"ఇప్పుడూ అలాగే జరిగింది. సాంబ శివరావుగారి వల్ల నేను జైలునుంచి బయట పడ్డాను. మళ్ళీ నాకు ఏ లోటు లేకుండా కొత్త జీవితం చూపించారు. ఆయన భార్య పోయి అయిదేళ్ళయింది. నా సంగతులన్నీ తెలిసి కూడా నన్ను క్షమించి పెళ్ళి చేసుకోవా లనుకున్నారు. మేం ఇద్దరం కలిసి ఇంతకాలంగా జీవి స్తున్నా నా కోరికలకు భిన్నంగా ప్రవ ర్తించలేదు. కనీసం ఏ రాత్రయినా నా గదిలో కాలు పెట్టలేదు.

"మళ్ళీ నేను మీ గురించి ఆశపడటం పొరపాటే. సాంబశివరావుగారు నా చరిత్రంతా చెప్పి మీ మనస్సు మార్చ వచ్చు. నిజంగా ఆయన నా వెల్ విషర్..."

అలా సీత ఇంకా మాట్లాడుతూనే ఉంది. కాని, కేశవరావు మాటల మధ్య ఎప్పుడు వెళ్ళిపోయాడో చూడనేలేదు. ★




చిత్రం — కుసుమ